గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథఫల్లి జూన్ 30 : గ్రామాల అభివృద్ధే సర్కారు లక్ష్యమని, ఇందుకనుగుణంగా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మేకల వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గ్రామాల్లోని లింక్ రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. పక్క గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా సమస్యను నివారించి రెండేళ్లలో లింక్ రోడ్లను అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని శ్రీహరి వివరించారు. గబ్బెట, కోడూరు, రామన్న గూడెం నుంచి పాలకుర్తికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసి కోడూరు నుంచి చీటూరుకు వెళ్లే వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం అందించే విషయంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

దేవాదులతో సాగు, తాగునీరు

జే చొక్కారావు(దేవాదుల) ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు సాగునీరందించడంతోపాటు ఆయా గ్రామాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు తగినన్ని నిధులు ఇవ్వలేదని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీకి రూ.8లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు శ్రీహరి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మధ్యాహ్న భోజనంలో లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్, వైస్ ఎంపీపీ రంగమ్మ, ఎంపీటీసీలు శాగ నాగరాజు, కేమిడి రమ్య-రాజు, అల్లిబిల్లి కృష్ణ, భిక్షపతి నాయక్, రచ్చ సోమనాథం, సుల్తాన్, దేవారెడ్డి, పేర్నె ఉషా-రవి, నాయకులు గంగిడి నర్సింహారెడ్డి, మేకల నరేందర్, జగదీశ్‌చందర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, నీలం యువరాజ్, తాటికొండ వెంకటేశ్‌యాదవ్, జీ రవి, గాదె మహేందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత అల్పాహారం అభినందనీయం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రోగులకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామరూరల్, జూన్ 30 : మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో రోగులకు ఉచితంగా అల్పాహారం అందించడం అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దవాఖానలోని రోగులకు ప్రతిరోజు ఉచితంగా అల్పాహారం అందిస్తున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పల్లా మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో ఇలాంటి కార్యక్రమం అమలు చేయడం సంతోషకరమన్నారు. లయన్స్‌క్లబ్ అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, రీజియన్ చైర్మన్ కదిరి రాజశేఖర్‌రెడ్డి, జోన్ చైర్మన్ జైన రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటాలి

జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోకల జమున

జనగామ చౌరస్తా, జూన్ 30 : జిల్లా ప్రజల ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమను భావితరాలకు చాటిచెప్పేందుకు జైన స్తూపాన్ని పునర్నిర్మాణం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునాలింగయ్య అన్నారు. దీనికి సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్‌ను జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ ఈ ప్రాంత చరిత్రకు మూలాధారం, ఉద్యమాలకు స్ఫూర్తి కలిగించిన జైన స్తూపాన్ని జిల్లా కేంద్రంలో పునఃప్రతిష్ఠించుకోవడం చారిత్రక అవసరమన్నా రు. జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రాంత చరిత్ర, పోరాట పటిమను భావితరాలకు అందించడానికి జైన స్తూపాన్ని పున ప్రతిష్ఠించుకోవాలన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, కౌశిక్, సుభాశ్, సురేశ్, వినోద్, చరణ్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా స్టేషన్‌ఘన్‌పూర్ మండల సభ

మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ కందుల రేఖ

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 : ప్రజాసమస్యలపై చర్చించకుండానే స్టేషన్‌ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సభకు అధికారులందరూ హాజరుకాలేదు. గ్రామాల్లో ప్రజల సమస్యలను చర్చించి, అభివృద్ధి పను లు చేపట్టేందుకు చర్యలు తీసుకోవా ల్సి ఉన్నా ఆ దిశగా చర్చలు జరగలే దు. ఆర్డీవో, తహసీల్దార్, ఎక్సైజ్, ఐసీడీఎస్‌తోపాటు ఇతర శాఖల అధికారులు, గ్రామాల ప్రత్యేకాధికారులు హాజరుకాకపోవడంతో ప్రజాప్రతినిధులు నిరుత్సాహానికి గురయ్యారు. గ్రామాల్లో గుడుంబాను నియంత్రిం చి బెల్ట్‌షాపులను అరికట్టాల్సిన ఎక్సై జ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెలువడ్డాయి. ఇదిలా ఉం డగా ఐదేళ్లు తమకు అధికారులు, మండల ప్రజల సహకరించినందుకు ఎంపీపీ కం దుల రేఖాగట్టయ్య, వైస్ ఎంపీపీ చల్లా సు ధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలిపా రు. భవిష్యత్‌లోనూ ప్రజాసేవకు కృషి చేస్తామన్నారు.

కస్టమర్‌పై పెట్రోల్ బంక్ యజమాని తండ్రి దాడి

రఘునాథపల్లి హెచ్‌పీ బంక్‌లో ఘటన

రఘునాథపల్లి, జూన్ 30: కస్టమర్‌పై పెట్రోల్ బంక్ యజమాని తండ్రి దాడికి పాల్పడిన ఘటన ఆదివారం మండల కేంద్రం లో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెంది న గండికోట శేఖర్ ఆదివారం హైదరాబాద్ వెళ్లే రూట్‌లో హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో డీజిల్ పోయించుకునేందుకు ట్రాక్టర్ తీసుకొచ్చాడు. రూ.470 డీజిల్ పోయించుకుని రూ.500 నోటు ఇచ్చి మిగతా చిల్లర ఇవ్వాలని బంక్‌లోని సిబ్బందిని కోరాడు. నోటుపై నూనె మరకలు ఉండడంతో వేరే నోటు ఇవ్వాలని వారు సూచించారు. దీంతో శేఖర్ నా దగ్గర ఇదొక్క నోటు మాత్రమే ఉందనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. శేఖర్ తన బంధువుకు ఫోన్ చేసి విషయం చెప్పగా అతడు పెట్రోల్‌బంక్‌కు వచ్చి రూ.500 ఫోన్ పే చేశాడు. అయినాగొడవ సద్దుమణగకపోవడంతో దీనిని గమనిస్తున్న బంక్ యజమాని తండ్రి నర్సయ్య అక్కడికి వచ్చి శేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందరూ చూస్తుండగానే శేఖర్‌పై చేయిచేసుకుని మొఖంపై పలుమార్లు కొట్టాడు. 'నేను పోలీసును రా..' అని మండిపడ్డాడు. విషయం తెలుసుకున్న శేఖర్ బంధువులు పెద్ద ఎత్తున పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో చేసేదేమీ లేక బంక్ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని విషయం తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన బంక్ యజమాని చిత్రాలు సీసీ పుటేజీలో ఉన్నాయని, దాని ఆధారంగా అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలోనూ బంక్ యజమాని ఒకరిపై ఇలాగే దాడి చేశాడని గుర్తు చేశారు. బంక్ యజమాని రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి కావడంతో కస్టమర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపించారు.

కొడకండ్ల : సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రాజేందర్‌రెడ్డి

అర్హులందరికీ 'రైతు భరోసా' అమలు

అవగాహన సదస్సులో డీసీవో రాజేందర్‌రెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల జూన్ 30 : అర్హులందరికీ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని డీసీవో రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొడకండ్ల, దేవరుప్పుల మండలకేంద్రాల్లోని రైతు వేదికల్లో రైతు భరోసాపై అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీవో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసాపై అపోహలను తొలగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామనారు. దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. కొడకండ్లలో జరిగిన సదస్సులో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోర్నిలియాస్, ఎంపీపీ ధరావత్ జ్యోతి, టీఎస్‌ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య, కో ఆప్షన్ మెంబర్ నజీర్, సొసైటీ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు, ఎంపీటీసీ రామ్‌కోటి, ఎండీ నరేశ్, ఏఈవో నవ్య, డైరెక్టర్లు, దేవరుప్పులలో ఆడిటర్ మురళి, పీఏసీఎస్ సీఈవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

బచ్చన్నపేట, జూన్ 30 : మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుభరోసా పథకంపై నేడు రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయాలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ సమావేశానికి డీసీవో రాజేందర్‌రెడ్డి, ఏవో విద్యాకర్‌రెడ్డి, ఏఈవోలు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30గంటల వరకు అన్ని గ్రామాల రైతులు, పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న వారు హాజరు కావాలని ఆయన కోరారు.

రాజ్‌కుమార్‌శాస్త్రికి పురస్కారం

జఫర్‌గఢ్, జూన్ 30 : మండలంలోని ఒబులాపూర్‌కు చెందిన నంచర్ల రాజ్ కుమార్‌శాస్త్రికి వాస్తు జ్యోతిష్య పురోహిత అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ హిందూ దేవాలయ, ఆస్ట్రాలజీ స్ప్రిచువల్ వెల్ఫేర్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నయ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందించారని ఆదివారం రాజ్ కుమార్‌శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు జే విశ్వనాధన్ అవార్డు గ్రహీత రాజ్‌కుమార్‌శాస్త్రిని ఘనంగా సన్మానించగా గ్రామస్తులు అభినందించారు.

గుట్కా నిల్వలున్న వ్యక్తిపై కేసు

జనగామ చౌరస్తా, జూన్ 30 : ప్రభుత్వ నిషేధిత గుట్కా, తంబాకు విక్రయించేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుట్కా, పొగాకు ఉత్పత్తులపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాన్‌షాపు నిర్వాహకుడు ఎండీ బషీర్ గుట్కా, తంబాకు నిల్వలు కలిగి ఉండడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై సృజన్, హెడ్ కానిస్టేబుళ్లు సంజీవ, నారాయణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో జాతీయ జెండాతో క్రీడాభిమానులు

టీ20 'వరల్డ్ కప్' సంబురాలు

జనగామ, పాలకుర్తిలో క్రీడాభిమానుల ర్యాలీ

జనగామలో సంబురాలు చేసుకుంటున్న క్రికెట్ అభిమానులు

జనగామ చౌరస్తా, జూన్ 30 : క్రికెట్ సామ్రాజ్యంలో టీ-20 వరల్డ్ కప్ విజేతగా రెండోసారి టీమిండియా భారీ విజయాన్ని సాధించడంతో భారతీయుల గుండెల్లో ఆనందం ఉప్పొంగింది. దీంతో ఆదివారం జిల్లా కేంద్రంలో క్రికెట్ అభిమానులు ఉత్సాహంగా వీధుల్లోకొచ్చి జయహో భారత్ అంటూ నినదించారు. జాతీయ జెండాను ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని, పటాకులు కాల్చారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి నెహ్రూపార్కు మీదుగా రైల్వే స్టేషన్ వరకు క్రికెట్ అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సాయి, రాజేశ్‌రెడ్డి, అసద్, రిజ్వాన్, మోయిజ్, బసీద్, ఫజల్, రహీమ్, చందు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : ప్రపంచ కప్ విజేతగా భారత్ నిలవడంతో మండల కేంద్రంలో క్రీడాకారులు సంబురాలు నిర్వహించారు. రోహిత్‌శర్మ సారథ్యంలోని భారత జట్టు దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు క్రికెట్ అభిమానులు శనివారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను ప్రదర్శించి దేశ భక్తిని చాటారు. పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను సత్కరిస్తున్న నరేశ్‌కుమార్

బచ్చన్నపేట, జూన్ 30 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాస్విక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వాస్విక్ ఫౌండేషన్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నరేశ్‌కుమార్ వివరించారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క రాష్ట్రంలో వాస్విక్ ఫౌండేషన్ అందిస్తున్న సామాజిక సేవలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాధితుడికి రూ.2.50 లక్షల సాయం

లింగాలఘనపురం, జూన్ 30 : మండలంలోని నేలపోగులకు చెందిన కట్ల శ్రీను అనారోగ్యానికి గురికాగా వైద్య చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌లో రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్‌వోసీని వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహ రి ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో బాధితుడికి అందించారు. నేలపోగుల మాజీ సర్పంచ్ దూసరి గణపతి పాల్గొన్నారు.

నేడు గడ్డం సమ్మయ్యకు అభినందన సభ

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న గడ్డం సమ్మయ్య(ఫైల్)

దేవరుప్పుల, జూన్ 30 : ప్రముఖ చిందు కళాకారుడు గడ్డం సమ్మయ్య ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న నేపథ్యంలో వారి స్వగ్రామమైన మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరుకానున్నారు. సభాధ్యక్షుడిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గడ్డం మోహన్‌రావు వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, పరిశోధకులు గుర్రం సీతారాములు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

4న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్

జనగామ చౌరస్తా, జూన్ 30 : జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జూలై 4న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరుగుతాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 8, 10, 12 ఏళ్ల వయసున్న బాలబాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7న గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగే రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జూలై 4న ఉదయం 9గంటల వరకు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంతో మినీ స్టేడియం వద్దకు హాజరుకావాలని సూచించారు. ఎనిమిదేళ్ల వయసున్న క్రీడాకారుల పుట్టిన తేదీ 8.7.2016 నుంచి 7.7.2018 మధ్య ఉండాలని పేర్కొన్నారు. పదేళ్ల వయసున్న క్రీడాకారుల పుట్టిన తేదీ 8.7.2014 నుంచి 7.7.2016 మధ్య, పన్నెండేళ్ల వయసున్న క్రీడాకారుల పుట్టిన తేదీ 8.7.2012 నుంచి 7.7.2014 మధ్య ఉండాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు గంగిశెట్టి మనోజ్‌కుమార్ సెల్ నంబర్ 9885046437, అవుల అశోక్ 99124532 20, వంచ చంద్రశేఖర్‌రెడ్డి 7799552233లో సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భా వ దినోత్సవం

నర్మెట, జూన్ 30 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 30వ వార్షికోత్సవాలను ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ తెలిపారు. ఆదివారం మండలంలోని హన్మంతాపూర్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహిస్తున్న పోరాటాన్ని వివరించారు. వార్షికోత్సవాల నేపథ్యంలో ప్రతి గ్రామంలో గద్దెలను పునర్నిర్మించాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్‌మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్‌మాదిగ, నాయకులు ఇరుగు కృష్ణమూర్తి మాదిగ, చిందు నాయకులు పిన్నింటి రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రఘునాథపల్లి, జూన్ 30: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన ఉత్తెపు రాజు, దాసరి కమలాకర్ అనుమతులు లేకుండా మండెలగూడెం వాగు నుంచి ఆదివారం ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు తనిఖీ చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెదతండాలో ఫ్రిజ్ పేలి సామగ్రి దగ్ధం

దేవరుప్పుల, జూన్ 30 : మండలంలోని పెదతండాలో గుగులోత్ భాస్కర్ ఇంట్లో ఫ్రిజ్ పేలడంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కర్ ఆదివారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఇంతలో ఇంట్లోని ఫ్రిజ్ పేలడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల వారు తలుపులు తెరిచి చూడగా పొగలు కనిపించాయి. ఈ ఘటనలో ఇంట్లోని సామగ్రితోపాటు నగదు కాలిపోయాయని బాధితుడు భాస్కర్ తెలిపారు. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. బాధితుడిని ఆదుకోవాలని గ్రామానికి చెందిన చంద్రభాను అధికారులను కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

ఆర్టీసీ అభివృద్ధికి పురుషులు సహకరించాలి

వరంగల్ -1 డిపో మేనేజర్ మోహన్‌రావు

ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మోహన్‌రావు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 : ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సేవలను వినియోగించుకుని సంస్థ అభివృద్ధికి పురుషులు సహకరించాలని వరంగల్ - 1 డిపో మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ పరిసరాలను ఆయన పరిశీలించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రయాణికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రతి రోజు 65 నుంచి 70 శాతం మహిళలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఒక్కోసారి బస్సులో సీట్లు లేకపోవడంతో పురుషులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా, ఆర్టీసీ సేవలను వినియోగించుకుని సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. అవసరమైతే మరిన్ని బస్సులు నడుపుతామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌ను ఆధునీకరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్టీసీ కంట్రోలర్ ఈఎస్ బాబు, బోసు ఐలయ్య, కుంభం కుమార్ ఉన్నారు.

గూడ్సు రైలులో పొగలు..

జనగామ వద్ద తప్పిన పెను ప్రమాదం

గూడ్సు రైలులో పొగలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జనగామ చౌరస్తా, జూన్ 30 : కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్సు రైలులో దట్టమైన పొగలు వెలువడిన ఘటన ఆదివారం జనగామ రైల్వేస్టేషన్‌లో వెలుగు చూసింది. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్సు రైలులో జనగామ వద్ద పొగలు వెలువడ్డాయి. అప్రమత్తమైన రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ సాయంతో గూడ్సు రైలు బోగిలోంచి వస్తున్న పొగలను చల్లార్చారు. బొగ్గును రవాణా చేసే క్రమంలో బోగిలో నుంచి దట్టమైన పొగలు వస్తాయని, కొన్నిసార్లు మంటలు చెలరేగి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. పెను ప్రమాదం తప్పడంతో రైల్వే అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

పదోన్నతి పొందిన హెచ్‌ఎంకు సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 : పదోన్నతి పొంది ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన మంగు జయప్రకాశ్‌ను మున్నూరుకాపులు ఘనంగా సన్మానించారు. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి హిమ్మత్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా జయప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో మున్నూరుకాపు కులస్తులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ కొంతం శ్రీనివాస్, తోట సత్యనారాయణ, తోట వెంకటేశ్వర్లు, తోట భిక్షపతి, లక్ష్మీనారాయణ, వేముగంటి రాంప్రసాద్, వేముగంటి రమేశ్, వీ శ్రీనివాస్, తోట భాస్కర్, చంద్రయ్య, వాసం శ్రీధర్, భ్యాంకు శ్రీధర్, తోట సోమేశ్వర్, గాండ్ల మహేందర్, తోట రమేశ్, పింగిళి రాహుల్, కొంతం దినేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

తిరుమలనాథస్వామి ఆలయంలో పూజలు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 : మండల కేంద్రంలోని తిరుమలనాథస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పునర్నిర్మించి తొమ్మిదేళ్లవుతున్న సందర్భంగా ఆలయ ధర్మకర్త కలకోట రంగాచారి ఆధ్వర్యంలో అర్చకులు కలకోట రామాచార్యులు, కలకోట నరేశ్‌చార్యులు ఉత్సవమూర్తులను అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యాద శ్రీనివాస్, సరాబు అంజనేయులు, జోగు ప్రణయ్, తెల్లాకుల రామకృష్ణ, కొలిపాక సతీశ్‌కుమార్, గౌరిశెట్టి శ్రీనివాస్, పాలకుర్తి సోమశేఖర్, శ్రీనివాస్, మంకాళి జయ్, గన్ను రమేశ్, నాగబండి వెంకట్రాంనర్సయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల : చిన్నమడూరులో గురువులతో పూర్వ విద్యార్థులు

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరుప్పుల, జూన్ 30 : మండలంలోని చినమడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1998-99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వీరంతా ఒక చోట చేరి చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరనర్సయ్య, కమలాకర్, రాములును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం పాఠశాలకు పూర్వ విద్యార్థులు రెండు బీరువాలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

శ్రీపతిపల్లిలో.

చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013-2014 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కరుణాకర్, ప్రవీణ్, సాంబరాజు, నవీన్, రాజేశ్, యాదగిరి, తిరుపతి, రంజిత్, నాటి గురువులు రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జ్యోతి, భాగ్యవతి, సుచరిత, కిషన్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, కల్యాణి, దిలీప్ పాల్గొన్నారు.

పోచమ్మ గుడి పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎల్లయ్య

జఫర్‌గఢ్, జూన్ 30 : మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మంచాల ఎల్లయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి నిర్మాణం అనంతరం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, ఉపాధ్యక్షుడు తాటికాయల యాకయ్య, ప్రధాన కార్యదర్శి కన్నా సోమశేఖర్, జ్యోతి యాకయ్య, కోశాధికారి బజ్జూరి యుగేందర్, దాంశెట్టి సోమేశ్వర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బైరి రవి, కమిటీ సభ్యులు రంజిత్ సింగ్, విజయ్, నర్సింగం, నంచర్ల యాదగిరి, కుల్లా మోహన్‌రావు, ఇల్లందుల మొగిళి పాల్గొన్నారు.